# ఓ కుక్క వ్యథ



## —కె. ఆర్. కె. మోహన్

"అక్కా... అక్కా...కుక్కలవాన్ వస్తోంది. మన కుక్క ఇంట్లో ఉందో లేదో చూడు. దానిని బయటకు పోనీయకు. వాళ్ళు పట్టుకుపోతారు" అంటూ కంగారుగా వచ్చి చెప్పాడు రఘు. మాధవి పరుగు పరుగున వెళ్ళి దొడ్లో, కుక్క పిల్లల్ని పెట్టిన చోటు చూసింది. దా ని గుంటలో కుక్క లేదు. ఇంకా కళ్ళైనా తెరుచుకోని మూడు పిల్లలూ మత్తుగా నిద్ర పోతున్నాయి. రఘు కూడా అక్క వెనకాలే వచ్చాడు.

కుక్క కనిపించకపోయేసరికి గుండె ఝల్లుమంది మాధవికి. "ఒరేయ్ కుక్క లేదురా. వీధిలోకి పోయి చూడు. కనిపిస్తే వెంటనే ఇంట్లోకి తెచ్చేయి. దిక్కుమాలిన వాళ్ళు దానిని చూశారంటే పట్టుకుపోతారు." అని తమ్ముణ్ణి తొందరపెట్టింది. బాణం లాగా వీధిలోకి దూసుకుపోయాడు రఘు.

మరికొంచెం సేపట్లోనే తిరిగి వచ్చాడు.

"అక్కా..కుక్కని వాళ్ళు పట్టేసుకున్నారే. బోను లోంచి నన్ను చూస్తూ కుయ్యిమని ఏడ్చిందే. ఆ కుక్క మాదని విడిచిపెట్టమని ఎంత బ్రతిమాలినా విడిచి పెట్టలేదే వాళ్ళు. మొన్ననే పిల్లల్ని పెట్టిందని, తల్లి లేకపోతే పిల్లలు చచ్చిపోతాయని కూడా చెప్పాను. అయినా వాళ్ళు వినలేదు. రెండు రూపాయలిస్తే విడిచి పెట్తారట. ఇప్పుడే తెస్తా నంటూ పరుగెత్తుకు వచ్చాను" అంటూ రొప్పుతూ చెప్పాడు రఘు.

"ఒరేయ్.. నువ్వు పరుగెత్తుకెళ్ళి, మా అక్క పైసలు తెస్తోందని చెప్పి వాళ్ళు వెళ్ళిపోకుండా ఆపు. అమ్మ నడిగి డబ్బులు తీసుకుని నీ వెనకాలే నేనూ వస్తాను" అంది మాధవి.

వీధిలోకి పరుగుతీశాడు రఘు.

స్నానం చేస్తున్న అమ్మని తొందరపెట్టి, రెండు రూపాయలు తీసుకుని తానూ వీధిలోకి పరుగెత్తింది మాధవి.

కాని వాళ్ళు వెళ్ళే సరికే కుక్కలున్న మునిసిపల్ వ్యాన్ ఎటు పోయిందో పోయింది. అది ఎటుపోయిందానని చాలాసేపు అక్కా తమ్ముడూ వెతికారు. కాని అది కనిపించలేదు.

మాధవికి, రఘుకి ఆ కుక్క సంగతి తలుచుకుంటుంటే ఏడుపు ఆగడం లేదు రోడ్డు మీద ఏడవడం బాగుండదని, అతి కష్టం మీద ఆపుకున్నారు. ఇంటికి రాగానే వాళ్ళ ఏడుపుకట్టలు తెంచుకుంది. తల్లి ముందు జరిగింది చెప్పి భోరుమన్నారు. ఆమె మాత్రం ఏమి చేయగలదు? ఆమెకుడా ఎంతో బాధ పడింది. "దుర్మార్గులు.. జాలీ దయా లేని వాళ్ళు. పిల్లల్ని పెట్టిందన్నా వినకుండా తీసుకు పోయారా! వాళ్ళూ అలాగే ఏడుస్తారు" అంటూ తిట్ట సాగింది. "తల్లి లేక పోతే ఆ పిల్లలేమవుతాయే.. అంటూ ఏడ్చింది మాధవి.

"చచ్చిపోతాయి కదే అమ్మా" అంటూ అందుకున్నాడు రఘు.

"ఇప్పుడు వాటిని ఎలాగే పెంచడం?"

"కొంచెం కొంచెం పాల చుక్కల్ని వాటి నోట్లో




పోద్దాం''

''అయితే వెంటనే పాలియ్యమ్మా''

పాలు తీసుకురావడానికి తల్లి లోపలికి వెళ్ళింది.

అసలు అది ఊరకుక్క. అది ఊరకుక్కే అయినా, దాని రక్తం ఎటువంటిదోకాని జాతి కుక్కలాగా ఉండేది. ఆ నునుపు, ఆ ఠీవి అన్నీ కూడా ముచ్చట కొలిపేవిగా ఉండేవి వాళ్ళింటికి వస్తుంటే కాస్త అన్నం మెతుకులు పడేసేవారు దానికి. ఆ విశ్వాసంతో అది వాళ్ళింట్లోనే ఉండేది. ఎక్కడెక్కడ తిరిగి వచ్చినా చీకటి పడగానే మాత్రం ఇంటికి తిరిగి వచ్చేది. ములగ చెట్టుకింద చేసుకున్న గుంటలో పడుకుంటూ ఉండేది. పగటి పూట వీధిలో తిరుగుతున్నా చీటికి మాటికి ఇంటికి తిరిగి వస్తుండేది. కొత్త వాళ్ళెవరైనా వస్తే భౌయ్యుమని మొరిగేది. మేకలు కవక దొడ్లోకి వస్తే భౌభౌమని అరుస్తూ లాంగ్ జంప్ చేస్తూ వాటి మీద పడి తరిమేది. పధ్నాలుగేళ్ళ మాధవికీ, పదకొండేళ్ళ రఘుకీ ఆ కుక్కతో ఆడుకోడం ఒక సరదా. అదో కాలక్షేపం. అటు వంటి కుక్క మునిసిపాలిటీ వాళ్ళ చేతుల్లో దుర్మరణం పాలు కావడంతో వాళ్ళకి ఆప్తమిత్రుడు పోయినట్లు కుటుంబ సభ్యుడు కరువైనట్లు అని పించసాగింది.

తన గుర్తుగా ఆ కుక్క మిగిల్చిపోయిన ఆ మూడు కూనల్నీ పెంచే బాధ్యత అక్కా తమ్ముళ్ళు స్వీకరించారు. గ్లాసులో పాలు తెచ్చి వాటిలో దూదిని ముంచి రఘు కుక్క పిల్లల నోరు తెరిచి పట్టుకుంటే, మాధవి బొట్లు బొట్లుగా వేసేది. అలవాటు లేక పోవడంతో కుక్క పిల్లలు ఆ పాలచుక్కల్ని మింగ లేక పోయేవి. అవి పక్కనుంచి కారిపోయేవి. తెచ్చిన పాలు అయ్యేదాకా అలా కుస్తీ పట్టేవాళ్ళు అక్కా తమ్ముళ్ళు. ఆ గ్లాసుడు పాలలో మూడొంతులుపైన నేల పాలయ్యేవి. ఆ మిగిలిన కాసినీ అతి కష్టంమీద వాటి కడుపులోకి పోయేవి.

రోజులు ఆ విధంగా గడుస్తున్నాయి. కుక్క పిల్లలు నెమ్మది నెమ్మదిగా పోతపాలకి అలవాటు పడుతున్నాయి. అయితే వేరే పాలు పడలేదో, మరెందుకో కాని ఆ మూడింటిలో రెండు పిల్లలు రెండు నెలలు తిరక్కుండా చచ్చిపోయాయి. అవి పోడం కూడా ఆ అక్కా తమ్ముళ్ళకి ఎంతో బాధనిపించింది. కనీసం ఆ మూడో పిల్లనైనా దక్కించుకోవాలని, మరింత శ్రద్ధగా జాగ్రత్తగా దానిని పెంచసాగారు. ఎలాగైతే వారి కృషి ఫలించి, ఆ కుక్కపిల్ల బతికి ముద్దుగా బొద్దుగా పెరగసాగింది. పైగా అది మగది కావడంతో దానికి మళ్ళీ పిల్లలు పుట్టడం, మళ్ళీ వాటికోసం తాపత్రయం ఉండదని వారికి సంతోషంగా ఉండేది.

ఆ కుక్క పిల్లకి 'మోతీ' అని ముద్దుపేరు పెట్టుకున్నారు వాళ్ళు. ''మోతీ'' అని పిలిస్తే చాలు ఎక్కడున్నా పరుగుపరుగున వచ్చేసేది. వారి ప్రక్కన నుంచుని తోకాడిస్తుండేది. వాళ్ళు ఎక్కడికైనా వెళ్ళి వస్తే రెండు కాళ్ళూ భుజాల మీద పెట్టేసి ముఖం నాకాలని ప్రయత్నం చేసేది.

'మోతీ' మాధవీ, రఘులకు చిట్టి తమ్ముడు. రోజూ దానికి ఒళ్ళంతా శుభ్రంగా సబ్బుతో రుద్ది స్నానం చేయించే వాళ్ళు. అప్పుడప్పుడు సాయంత్రం పూట దానిని వెంట పెట్టుకుని షికారు తీసుకెళ్తుండేవారు. ఇంట్లో ఉన్నప్పుడు దానితో ఆడుకుంటుండేవారు. బంతిని విసిరేస్తే అది పరుగెత్తి వెళ్ళి నోటితో కరుచుకుని తెచ్చేది. దాని సహచర్యంతో బలే ఉషారుగా గడిచిపోతోంది వాళ్ళకాలం.

రెండేళ్ళు గడిచిపోయాయి. మాధవి వాళ్ళ నాన్నగారికి హైదరాబాద్‌కి బదిలీ అయింది. హైదరాబాద్ వెళ్ళడ మంటే ఆయనకి ఇష్టమేకాని మోతీ పెద్ద సమస్య అయింది. దానిని కూడా తీసుకు వెళ్ళాలని మాధవీ, రఘు పట్టుపట్టారు. కాని ఆయనకీ ఆయన భార్యకీ కూడా కుక్కలూ, పిల్లులూ అంటే ఇష్టం లేదు. ఏదో ఊళ్ళో అయితే ఇన్నాళ్ళు పిల్లలకోసం సరి పెట్టుకున్నారు కాని, పరాయి ఊరికి కూడా అందులోనూ హైదరాబాద్ వంటి నగరానికి కూడా తీసుకు వెళ్తామంటే ఎలా? అందులో అక్కడ కొంపల్లో తమకే చోటుండదు ఇంకా కుక్క కూడానా. పైగా ఏ మేడమీదో ఇల్లు దొరికితే మరింత సమస్యకూడాను. ఇరుగుపొరుగు వాళ్ళతో లేనిపోని జట్టీలు కూడాను. ఇవన్నీ ఆలోచించి కుక్కని తీసుకెళ్ళకూడదనే నిర్ణయానికి వచ్చారు వాళ్ళు. పిల్లలేవో చెప్పబోతే కసురుకున్నారు కూడాను. ఇంకవేరే ఏమీ చెప్పలేక గుడ్ల నీరు కుక్కుకున్నారు పిల్లలు.

ఆయన రిలీవు కాగానే, హైదరాబాద్ వెళ్ళి ఇల్లు చూసుకుని వచ్చారు. వచ్చాక సామానంతా ప్యాక్ చేసి లారీకి ఎక్కించేశారు. మర్నాడే వారి ప్రయాణం. ప్రయాణం దగ్గర పడుతున్న కొద్దీ మాధవీ, రఘులకి దిగులు ఎక్కువైపోతోంది. వాళ్ళ ధోరణి పసి కట్టిన వాళ్ల నాన్నగారు కుక్కవీధిలోకి తిరగడానికి పోయిన సమయం చూసి, జట్కా ఎక్కి అందర్నీ రైలు స్టేషన్‌కి బయలుదేరదీశారు. ఆ ఊరికి రైలు స్టేషన్ ఆరు మైళ్ళు దూరంలో ఉంది.

జట్కా ఊరి పొలిమేర దాటింది. ఇంకా పర్వాలేదు అనుకున్నారు వాళ్ళు. జట్కా రోడ్డు మలుపు తిరిగింది. ఎప్పుడు పసికట్టిందో ఏమో మోతీ పరుగు పరుగున వచ్చి, జట్కా వెనకాలే పరుగెత్తుకు రాసాగింది. దానిని చూసి నిశ్చేష్టులయ్యారు దంపతులిద్దరూ మాధవికీ, రఘుకీ దానిని చూస్తే ఎంతో ఆనందం వేసింది కాని, నాన్నగారేమంటారోనని భయపడి ఊరుకున్నారు.

జట్కా వెళ్తూనే ఉంది మోతీ వెంటాడుతూనే ఉంది. అది రైలుస్టేషన్‌కి రాక తప్పదు. అక్కడికి వచ్చాక పిల్లలేం గోల చేస్తారో! అని ఆలోచించి జట్కాని వెనక్కి తిప్పమన్నాడాయన.

జట్కా వెళ్ళి తిన్నగా ఆయన స్నేహితుడు రంగనాథం గారింటి ముందు ఆగింది. అనుకోకుండా వచ్చిన ఈ అతిథులని చూసి ఆశ్చర్యపోయాడాయన. కుక్క సంగతి చెప్పి, దానిని వాళ్ళింట్లోనే కట్టేయమనీ, మర్నాడు తాము ఊరువెళ్తామనీ చెప్పాడు. ఆయన బజారు వెళ్ళి కుక్కకోసం గట్టి ఇనపగొలుసుని తెచ్చాడు.

ఆరోజు రంగనాథాన్ని కూడా కుక్కకి అలవాటు చేస్తూ దానిని స్వయంగా ఇనప గొలుసుతో కట్టేశాడు ఆయన.

మర్నాడు కుక్క చూడకుండా దొడ్డి త్రోవ వెంట రైలు స్టేషన్‌కి బయలుదేరదీశాడు ఆయన. గొలుసు కట్టిన కుక్క గమనించలేదని తెలుసుకుని తృప్తిగా నిట్టూర్చాడాయన.

జట్కా రైలు స్టేషన్ చేరింది. అందరూ పెట్టెలోకి ఎక్కారు. కుక్కరాలేదు. ఇంక ఫర్వాలేదనుకున్నారు దంపతులు. మాధవీ, రఘు మాత్రం వస్తున్న ఏడుపుని అతి కష్టం మీద ఆపుకుంటున్నారు.

రైలు కూత కూసింది. బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు వచ్చిందో ఏమో నాలిక ఆడించుకుంటూ, ఒక్క ఉదుటున రైలు పెట్టెలోకి దూకింది. తెగిన గొలుసుదాని మెడకి వ్రేలాడుతూనే ఉంది. కుక్కని చూడగానే రైలు పెట్టెలోని జనం ''హేయ్.. హేయ్..ఉష్..ఉష్..' అంటూ తరమడం మొదలు పెట్టారు. కుక్క వాళ్ళు అదిలిస్తుంటే ఒక అడుగు వెనక్కి వేస్తూ, మళ్ళీ ముందుకి వస్తోంది.

మాధవీ, రఘు ఆనందానికి అవధుల్లేవు. వాళ్ళ అమ్మా నాన్న మాత్రం నిశ్చేష్టులయిపోయారు. ఏమి చెయ్యాలో తోచలేదు వారికి.

రైలు మరోసారి కూసి కదిలింది.

జనం బలవంతాన కుక్కని బైటికి నెట్టారు. మాధవీ రఘు కిటికీలోంచి బయటికి చూడసాగారు.

కదులుతున్న రైల్లోకి మళ్ళీ ఎక్కే ప్రయత్నంలో మోతీ చక్రాల క్రింద పడిపోయింది.

రైలింజన్ మళ్ళీ భీకరంగా కూసి వేగం పుంజుకుంది. ఆ అరుపులో మోతీ ఆక్రందనం మాధవీ, రఘు భయంకరంగా అరచిన కేక కలిసిపోయాయి. ●